# గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

ఆంధ్రజ్యోతి
దినపత్రికలో అన్ని రకముల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
సంప్ర॥ 99854 11213 99854 11225 | 99854 01877 99854 04047 99854 01614



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ మయూర్ అశోక్

## ఇన్నర్ రింగ్‌రోడ్డు ఫేజ్-3 త్వరగా పూర్తి చేయాలి

● కమిషనర్ మయూర్ అశోక్

గుంటూరు (కార్పొరేషన్), ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధి లోని ఇన్నర్ రింగ్ రోడ్ ఫేజ్-3 పనులను వేగవంతంగా పూర్తి చేయాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో బుధవారం పట్టణ ప్రణాళిక, పబ్లిక్ హెల్త్, ఇరిగేషన్, ట్రాన్స్‌కో, సీపీడీసీఎల్ అధికారులతో ఇన్నర్ రింగ్‌రోడ్ ఫేజ్-3 పనుల పురోగతిపై ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇన్నర్ రింగ్ రోడ్డు నగర ట్రాఫిక్ రద్దీని తగ్గించడంతో పాటు భవిష్యత్తు రవాణా అవసరాలకు కీలకమైన మౌలిక సదుపాయంగా నిలుస్తుందని అన్నారు. ప్రాజెక్టు పనుల్లో జాప్యానికి తావు లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని సూచించారు.

### ప్లాస్టిక్ నిషేధాన్ని కఠినంగా అమలు చేస్తాం

నగరపాలక సంస్థ పరిధిలో ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ నిబంధనలు, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు, ఆగస్టు 17 నుంచి 'సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని కఠినంగా అమలు చేయనున్నట్లు నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. కమిషనర్ ఆదేశాల మేరకు బుధవారం వార్డు సచివాలయాల వారీగా ఎన్విరాన్‌మెంట్ కార్యదర్శులు, ప్రజారోగ్య అధికారులు, కార్మికులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని సమర్థవంతంగా అమలు చేయడానికి డిప్యూటీ కమిషనర్లు, హెల్త్ ఆఫీసర్లు, శానిటరీ సూపర్‌వైజర్లతో 'టాస్క్‌ఫోర్స్ కమిటీ'ని ఏర్పాటు చేశామన్నారు. నగర ప్రజలు, వ్యాపార వాణిజ్య సంస్థల ప్రతినిధులు ప్లాస్టిక్ నిషేధిత గుంటూరు నగర సాకారానికి సహకరించాలని కోరారు.

## ఫుడ్ మెషిన్‌కు రూ.2 లక్షల విరాళం

గుంటూరు(తూర్పు), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక కుందుల రోడ్డులో కమ్మ బాలికల విద్యార్థినుల వసతిగృహంలో ఏర్పాటు చేసిన రేషనల్ ఐకాంబి ఫుడ్ మెషిన్‌కు కమ్మజనసేవా సమితి గౌరవ సలహాదారు వంకాయలపాటి బాలరామకృష్ణయ్య రూ.2 లక్షల విరాళాన్ని ప్రకటించారు. ఈ చెక్కును బుధవారం సమితి అధ్యక్షుడు మల్లెల హరేంద్రనాథ్ చౌదరికి అందజేశారు. హరేంద్రనాధ్ చౌదరి మాట్లాడుతూ ఈ యంత్రానికి పాలకవర్గ సభ్యులు, దాతల సహకారంతో రూ.15 లక్షలు సమకూరినట్టు తెలిపారు. దాతల నుంచి మరో రూ.4 లక్షలు అందాల్సి ఉందన్నారు. సుమారు 1,600 మంది విద్యార్థినులకు అత్యాధునిక సాంకేతికతతో పరిశుభ్రమైన, నాణ్యమైన ఆహారం అందించేందుకు ఈ యంత్రాన్ని కొనుగోలు చేసినట్టు చెప్పారు. బాలరామ కృష్ణయ్య అందించిన సహకారానికి పాలకవర్గ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమితి ఉపాధ్యక్షుడు మాదాల రత్న గిరి బాబు, సంయుక్త కార్యదర్శి రాయపాటి గోపాలకృష్ణ, ప్రత్యేక ఆహ్వానితులు పెద్ది సాంబశివరావు పాల్గొన్నారు.



మల్లెల హరేంద్రనాథ్‌చౌదరికి చెక్కును అందజేస్తున్న వంకాయలపాటి బాలరామ కృష్ణయ్య

## గుండెలో రంధ్రానికి 30 ఏళ్ల తర్వాత శస్త్రచికిత్స

● శ్రీసాయి హాస్పిటల్‌లో అరుదైన కేసు

గుంటూరు మెడికల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఆ యువకుడు పుట్టుకతో గుండెలో రంధ్రంతో జన్మించినా, ముప్పై ఏళ్లు వచ్చే వరకు సమస్యను గుర్తించలేకపోయారు. ఇటీవల సమస్యను గుర్తించిన వైద్యనిపుణులు శస్త్రచికిత్స చేసి గుండెలో ఏర్పడిన రంధ్రాన్ని సరిదిద్ది అతడి ప్రాణాలు కాపాడారు. బుధవారం అరండల్‌పేట 5/2లోని శ్రీసాయి ఆస్పత్రిలో జరిగిన మీడియా సమావేశంలో వైద్యులు ఈ కేసు వివరాలను తెలిపారు. అఫ్సాన్ (31) పుట్టుకతోనే గుండెపై భాగంలో రెండు గదుల మధ్య రంధ్రంతో జన్మించారు. దీనిని శాస్త్రీయ పరిభాషలో సైనస్ వీనోసల్ ఏట్రియల్ సెప్టల్ డిఫెక్ట్ (ఎస్‌వీ ఏఎస్‌డీ)గా పిలుస్తారు. పుట్టిన మొదటి నాలుగేళ్లలోపే దీనికి శస్త్రచికిత్స చేస్తారు. ఈ జబ్బులో పెద్దగా లక్షణాలు కనిపించని కారణంగా అతడికి 30 ఏళ్లు వచ్చే వరకు సమస్యను గుర్తించలేదు. సమస్యను గుర్తించిన వైద్యులు జూలై 24న క్లిష్టమైన శస్త్రచికిత్స చేశారు. కుడి వైపు ఉన్న సిరలను సరి చేసి ఎడమ గుండె గదులకు మార్చడంతో పాటు గుండెలో ఉన్న రంధ్రాన్ని సరి చేశారు. దీంతో అఫ్సాన్ ఆరోగ్యపరంగా కోలుకున్నారు. విలేకర్ల సమావేశంలో డాక్టర్ యోగి, డాక్టర్ గుడిపాటి ప్రభాకర్ శివ, డాక్టర్ అభిలాష్, డాక్టర్ నజీర్, డాక్టర్ మేమాంజలి, డాక్టర్ నవ్యశ్రీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ యోగి, డాక్టర్ ప్రభాకర్ శివ తదితరులు

## క్విట్ కార్పొరేట్ ఇండియా ఉద్యమాన్ని జయప్రదం చేయాలి

గుంటూరు(తూర్పు), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు నిరసన గా ఈ నెల 10న నిర్వహించనున్న క్విట్ కార్పొరేట్ ఇండియా ఉద్యమాన్ని జయప్రదం చేయాలని రైతు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య పిలుపునిచ్చారు. బ్రాడీ పేటలోని పీఎల్ రావు భవన్‌లో బుధవారం ఉల్లిగడ్డ నాగేశ్వరరావు అధ్యక్షతన రైతు, కార్మిక సంఘాల ఉమ్మడి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1942 క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఈ నెల 10న దేశవ్యాప్తంగా 540 రైతు సంఘాలు, కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు జైల్ భరో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిరసనల్లో భాగంగా జిల్లాలో కలెక్టరేట్ వద్ద, తాడేపల్లి సెంటర్‌లో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అనంతరం రైతు సంఘం జిల్లా అధ్యక్షుడిగా ములకా శివసాంబిరెడ్డిని నాయకులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో దండా లక్ష్మీనారాయణ, ఈమని అప్పా రావు, గనిరాజు, రవి, కె.విఠల్‌రెడ్డి, కె.శ్రీనివాసరావు, బి.ముత్యాలరావు, మరియదాసు పాల్గొన్నారు.

## దుర్గమ్మకు విశ్వబ్రాహ్మణుల ఆషాడ సారె

గుంటూరు(తూర్పు), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై వెలసిన కనక దుర్గమ్మకు రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఆషాడ సారె ఘనంగా సమర్పించారు. బ్రాహ్మణవీధిలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవి అన్నదాన సత్రం నుంచి మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఇంద్రకీలాద్రికి చేరుకుని, వేదమంత్రోచ్చారణల అమ్మవారికి సారెను సమర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు పావులూరి హనుమంత రావు, ధనాలకోట వాసు, దువ్వూరి నరసింహాచార్య, కొలగాని నందవరప్రసాద్, శివ కోటి వాసు, అంగలకుదుటి సుశీల తదితరులు పాల్గొన్నారు.

## గుంటూరు ఏసీబీ ఇన్‌స్పెక్టర్‌గా శ్రీనివాసరావు

గుంటూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా ఏసీబీ ఇన్‌స్పెక్టర్‌గా కె. శ్రీనివాసరావును నియమించారు. దీంతో ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఏసీబీ స్టేట్ హెడ్‌క్వార్టర్స్‌లో సేవలందించిన ఆయన బదిలీపై గుంటూరుకు వచ్చారు.



సీఐ శ్రీనివాసరావు

# స్వర్ణాంధ్ర లక్ష్య సాధనకు అవకాశాలు వినియోగించుకోవాలి

● పహాలే ఇండియా ఫౌండేషన్ జోనల్ కోఆర్డినేటర్ అనిల్



కలెక్టరేట్‌లో స్వర్ణాంధ్ర లక్ష్యసాధనపై జరిగిన శిక్షణలో పాల్గొన్న అధికారులు

గుంటూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర 2047 లక్ష్య సాధనకు అవకాశాలు విని యోగించుకోవాలని పహాలే ఇండియా ఫౌండేషన్ జోనల్ కోఆర్డినేటర్ అనిల్ అన్నారు. స్వర్ణాంధ్ర 2047 లక్ష్య సాధనకు అవకాశాలపై జిల్లా అధికారులతో బుధవారం కలెక్టర్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జోనల్ కోఆర్డినేటర్ అనిల్ మాట్లాడుతూ ప్రాథమిక రంగంలో ముఖ్యంగా ఉద్యాన పంటలు, చేపలు, మాంసం, వ్యవసాయ రంగాల్లో తలసరి ఆదాయం పెంపునకు ఎన్నో అవకాశాలు ఉన్నాయని తెలిపారు. పారిశ్రామిక రంగంలో 40వేల మందికి ఎంఎస్ఎంఈ ద్వారా ఉపాధి కల్పించవచ్చని చెప్పారు. జ

ముఖ్య ప్రణాళిక అధికారి పి.శేషశ్రీ మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీ నుంచి 14వ తేదీ వరకు వివిధ స్థాయిల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 7వ తేదీన తాడికొండ, మంగళగిరి మండలాల్లో, 10వ తేదీన తెనాలి, 11వ తేదీన గుంటూరు తూర్పు, పశ్చిమ మండలాలకు, 12వ తేదీన ప్రత్తిపాడు, పొన్నూరు నియోజకవర్గం స్థాయిలో జరుగుతుందన్నారు. 13, 14 తేదీల్లో కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ ఇస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## థింసా నృత్యానికి గిన్నిస్ రికార్డు రాష్ట్రానికే గర్వకారణం

గుంటూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవం సందర్భంగా గిరిజన విద్యార్థులు ప్రదర్శించిన థింసా నృత్యం గిన్నిస్ బుక్ కార్డు సాధించడం రాష్ట్రానికే గర్వకారణమని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ధారూనాయక్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన సీఎం చంద్రబాబును కలిసారు. ఈ ఘనత సాధించిన విద్యా ర్థులను ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రోత్సహించాలని కోరారు. అచ్చమ్మకుంట గ్రామానికి చెం దిన టీడీపీ నాయకుడు మేకల రాజు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కోలుకోలేని స్థితిలో ఉన్న ఆయన కుటుంబానికి జీవనోపాధి నిమిత్తం, ప్రభుత్వం తరపున రూ.2 లక్షల ఆర్థిక సాయం అందించాలని కోరగా, సీఎం సానుకూలంగా స్పం దిం చారని తెలిపారు.



సీఎం చంద్రబాబుకు టీడీపీ కార్యకర్త సమస్యను వివరిస్తున్న ధారూనాయక్

## అంబటిపై క్రిమినల్ కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలి

● అరండల్‌పేట స్టేషన్‌లో టీడీపీ జిల్లా అధ్యక్షుడు మాణిక్యరావు ఫిర్యాదు

గుంటూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర సహాయ మంత్రి పెమ్మసానిని కించపరిచేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వైసీపీ నాయకుడు అంబటి రాంబాబుపై క్రిమినల్ కేసు నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. భారత ప్రభుత్వంలో కీలక నేత అయిన మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ప్రతిష్ఠకు భంగం కలిగించే ఉద్దేశంతో వైసీపీ నాయకుడు అంబటి రాంబాబు తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా మార్ఫింగ్ చేసిన, అసత్యమైన, పరువు నష్టం కలిగించే వీడియోను పోస్టు చేసి ప్రచారం చేశారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో అంబటి రాంబాబుపై తగిన చట్టపరమైన నిబంధనల కింద క్రిమినల్ కేసు నమోదు చేయాలని, వీడియో రూపకల్పన, అప్లోడ్, ప్రచారం, వైరల్ చేయడంలో పాల్గొన్న వారందరినీ గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

## వైఎస్ భారతిపై పెట్టిన పోస్టుల కేసు కొట్టివేత



కోర్టులో కేసు కొట్టివేసిన అనంతరం న్యాయవాదులతో సాయికృష్ణ

గుంటూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): వైఎస్ జగన్ సతీమణి వైఎస్ భారతి పేరుతో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సోషల్ మీడియాలో అభ్యంతరకరమైన వ్యాఖ్యలతో పోస్టులు పెట్టారంటూ సీఐడీ నమోదు చేసిన కేసును కోర్టు కొట్టివేసింది. సోషల్ మీడియాలో అభ్యం తరంగా పోస్టులు పెట్టారంటూ అప్పట్లో సీఐడీ అధికారులు పలువురు టీడీపీ నాయకులను నిందితులుగా పేర్కొంటూ కేసు నమోదు చేశారు. రాజ్యసభ సభ్యుడు చింతకాయల విజయ్, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు రావిపాటి సాయికృష్ణ, ఆంధ్ర వాయిస్ ఛానల్ నిర్వాహకుడు ప్రతాపనేని అర్జున్‌లను నిందితులుగా చేరుస్తూ 2022 అక్టోబరు 1న గుంటూరు సీఐడీలో కేసు నమోదు చేశారు. అయితే తాము భారతిపై ఎటు వంటి పోస్టు పెట్టకపోయిన సీఐడీ పోలీసులు చట్టవిరుద్ధంగా కేసు నమోదు చేశారని టీడీపీ నాయకులు ఆరోపించారు.

## భార్యను వేధిస్తున్న భర్త, అత్తింటి వారిపై కేసు

గుంటూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : భార్యను వేధింపులకు గురి చేసిన భర్త, అత్తింటి వారిపై అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో గృహహింస, శారీరక దాడి బెదిరింపులకు సంబంధించి కేసు నమోదు చేశారు. తన భర్త చల్లా నాగరాజు, ఆయన కుటుంబ సభ్యులు తనను చాలాకాలంగా మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారని బాధితురాలు టి.దుర్గాభవాని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈనెల 2న రాత్రి భర్త తీవ్రంగా దాడి చేయడంతో బాధితురాలు తన తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చింది. 3న ఆమె తల్లిదండ్రులు అక్కడికి వెళ్లగా బాధితురాలి తండ్రిపై రాయితో దాడి చేసి, అలాగే తల్లిని తోసివేసి దాడి చేయగా వారు గాయపడినట్లు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదులో సంబంధిత చట్టాల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

### కొరియర్ పంపకుండా మోసం చేసిన నిర్వాహకుడిపై...

స్థానిక రెడ్డిపాలెం సోమేపల్లి కాలనీకి చెందిన ఎనిగంటి శైలజ అనే మహిళ గత 24న కెనడాలో ఉన్న తన అక్కా, బావలకు కొరియర్ ద్వారా పార్సిల్ చేయడానికి చీరలు, పూజా సామగ్రి, ఇత్తడి సామాన్లు, మొత్తం సుమారు రూ.లక్ష 50 వేల విలువైన వస్తువులను అరండల్‌పేట 8/2వ లైన్‌లో గల లక్ష్మీ కొరియర్ యజమాని అయిన విశ్వనాద్‌కు అప్పగించారు. సర్వీస్ చార్జీల నిమిత్తం రూ.55వేలు కూడా అందించింది. ఇంతవరకు సదరు పార్సిల్ కెనడాలో ఉన్న తన అక్క బావలకు అందలేదని, సదరు కొరియర్ యజమాని సరైన సమాధానం చెప్పడం లేదని, బాధితురాలు అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### యువతి అదృశ్యంపై...

అరండల్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో యువతి అదృశ్యమైనట్లు ఫిర్యా దు అందడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గుంటూరుకు చెందిన బెజ్జ శేఖర్‌బాబు, వెండ్యాల నాగమణి దంపతుల కుమార్తె బెజ్జ అనూష (29) శిక్షణ నిమిత్తం బయటకు వెళ్లి, 2026 ఆగస్టు 4 మధ్యాహ్నం అనంతరం ఇంటికి తిరిగి రాలేదని కుటుంబ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు.



బెజ్జ అనూష

## విద్యాసంస్థల వాహనాల ఫిట్‌నెస్‌పై స్పెషల్ డ్రైవ్ చేపట్టాలి

గుంటూరు(కార్పొరేషన్), ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా విద్యార్థులను తరలించేందుకు విద్యా సంస్థలు ఉపయోగించే వాహనాల ఫిట్‌నెస్‌పై రవాణాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, ఫిట్‌నెస్ లేని వాహనాలు, పరిమితికి మించి విద్యార్థుల్ని తరలించే వాహనాలను సీజ్ చేసి, పాఠశాల యాజమాన్యాలపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఏపీ శివసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వినోదుల నరసింహారావు డిమాండ్ చేశారు. బుధవారం గుంటూరు డీటీసీ సీతారాంరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. దీంతో స్పందించిన డీటీసీ తక్షణమే తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు శివసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వినోదుల నరసింహారావు తెలియజేసారు.

## కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల్లో హిందీ తప్పనిసరి

● సీజీఎస్‌టీ అధికారి సునీల్‌చౌదరి

గుంటూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల రోజువారీ కార్య కలాపాల్లో హిందీ వినియోగాన్ని విస్తృతం చేయాలని సీజీఎస్‌టీ గుంటూరు కమిషనరేట్ కు చెందిన అధికారి సునీల్‌చౌదరి అన్నారు. అధికారుల్లో హిందీ పరిజ్ఞానాన్ని మెరుగుపర చడం లక్ష్యంగా, టౌన్ ఆఫీషియల్ లాంగ్వేజ్ ఇంప్లిమెంటేషన్ కమిటీ ఆధ్వర్యంలో గుంటూరు సీజీఎస్‌టీ కమిషనరేట్ కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం హిందీ వర్క్‌షాప్ జరిగింది. ఈ కార్యక్రమానికి గుంటూరు, పరిసర నగరాల్లోని వివిధ కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల అధికారులు, సిబ్బంది పెద్దసంఖ్యలో హాజరయ్యారు. భారత ప్రభుత్వ అధికార భాషా విధానాన్ని అమలు చేయడం, అధికారిక ఉత్తర, ప్రత్యుత్తరాలు, పరిపాలనా పనులు, నోటింగ్, డ్రాఫ్టింగ్‌లలో హిందీ వినియోగాన్ని పెంచడం, అలాగే అధికారిక హిందీలో నైపుణ్యాన్ని పెంచుకోవడానికి అనువైన ఆచరణాత్మక పద్ధతులపై ఈ వర్క్‌షాప్ దృష్టి సారించింది. ఈ కార్యక్రమంలో గుంటూరు సీజీఎస్‌టీ కమిషనరేట్ జాయింట్ కమిషనర్ దేవ్ కుమార్ రాజ్వానీ, కేంద్ర ప్రభుత్వ శాఖల అధికారులు సూచనలు అందజేశారు.



సీజీఎస్‌టీ కమిషరేట్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖల అధికారులు

## ఓఆర్‌ఆర్ బాధిత రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం

● రైతు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య

గుంటూరు(తూర్పు), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్‌ఆర్) నిర్మాణం కోసం భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం జరిగే వరకు రైతు సం ఘం పోరాటం కొనసాగిస్తుందని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య స్పష్టం చేశారు. గుంటూరులోని బ్రాడీపేట యూటీఎఫ్ హాల్లో బుధవారం నిర్వహించిన ఓఆర్‌ఆర్ రైతుల కమిటీ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ఇప్పటివరకు స్పష్టమైన ప్రకటన చేయకుండా రహస్యంగా భూసేకరణ చర్యలు చేపడుతోందని ఆరోపించారు. సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్‌కుమార్ మాట్లాడుతూ రాజధాని అభివృద్ధి పేరుతో రైతుల భూములను తక్కువ ధరలకు స్వాధీనం చేసుకుని కార్పొరేట్ సంస్థలకు అప్పగించే విధానం సరికాదన్నారు. జొన్న శివశంకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వల్లూరి భార తి, ఓఆర్‌ఆర్ రైతుల కమిటీ నాయకులు కోయ కోటేశ్వరరావు, గుంటుపల్లి సాంబశివరావు, కే.పద్మావతి, రమేష్, కాజా వెంకటేశ్వరరావు, పీ శివపార్వతి, ములకా శివ సాంబిరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వి.కృష్ణయ్య, పాల్గొన్న రైతు సంఘ నాయకులు

## రోడ్డు విస్తరణ బాధితులకు నష్టపరిహారం ఇవ్వాలి

గుంటూరు(తూర్పు), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): నగరంలో లాడ్జి సెంటర్ నుంచి హిందూ కాలేజీ వరకు జరుగుతున్న రోడ్డు విస్తరణలో దెబ్బతిన్న అన్ని షాపుల యజమానులు, ఉద్యోగులకు నష్టపరిహారం చెల్లించాలని సీఐటీయూ నగర ఉపాధ్యక్షుడు కె.నళినీకాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక బ్రాడీపేట, సీపీఎం కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవల 24 మంది ఉద్యోగులను ప్రాజెక్ట్ ఎఫెక్టెడ్ ఫ్యామిలీస్‌గా గుర్తించి ఒక్కొక్కరికి రూ.5.50 లక్షల చొప్పున పరిహారం ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నట్టు చెప్పారు. నగర షాప్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈనెల 7న ఉదయం తహసీల్దార్ కార్యాలయంలో జరిగే బహిరంగ విచారణకు షాపు ఉద్యోగులందరూ హాజరుకావాలని కోరారు.

## నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల నిర్వహణలో భాగంగా గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు వాసవీనగర్, సాయినగర్, తారకరామనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. అలానే చెట్ల కొమ్మల తొలగింపు కార్యక్రమంలో భాగంగా లాలాపేట, సాంబశివపేట, రైలుపేట, కొత్తపేట ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ ముస్తాక్ అహ్మద్ మరో ప్రకటనలో తెలిపారు.

## ధర్మమే.. దైవం

● ప్రవచనకర్త కోటేశ్వరరావు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): సృష్టిలోని ధర్మాలన్ని దైవ స్వరూపమేనని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త కేవీ కోటేశ్వరరావు అన్నారు. స్థానిక బృందావన్ గార్డెన్స్, శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం, అన్నమయ్య కళావేదికపై వ్యాస మహర్షి రచించిన విశ్వనాధాష్టకంపై రెండు రోజుల పాటు జరిగే ఆధ్యాత్మిక ప్రవచనం బుధవారం ప్రారంభమైంది. తొలుత ఆలయ పాలక మండలి అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, వూటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. కేవీ కోటేశ్వరరావు ప్రవచనాన్ని కొనసాగిస్తూ ధర్మం తోడుగా ఉన్నప్పుడు దైవం ఉన్నట్లే అన్నారు. మన కర్మలని మార్చకుండా కర్మలలో దైవ భావం ఏర్పరుచుకుంటే జీవితం యజ్ఞ స్వరూపంగా మారుతుందని అన్నారు.

## వడ్డెరలకు మైనింగ్ క్వారీల్లో 33 శాతం రిజర్వేషన్

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): వడ్డెర సహకార సంఘాల ఆర్థికాభివృద్ధికి మైనింగ్ క్వారీల కేటాయింపుల్లో 33శాతం రిజర్వేషన్ కల్పించామని, కొత్తగా ఏర్పడిన వడ్డెర సొసైటీ లకు మైనింగ్ లీజులు కేటాయించే ప్రతిపాదనకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపిందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి చెప్పారు. 'ఇంటింటికి కూటమి ప్రభుత్వం-సంక్షేమ విజయాలు' కార్యక్రమాన్ని బుధవారం ఆమె నియోజకవర్గంలోని వడ్డెరగూడెంలో నిర్వహించారు. నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల వివరాలతో కూడిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వడ్డెర సామాజికవర్గ ఆర్థిక, సామాజిక అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యమిస్తోంద ని చెప్పారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు వీర వడ్డె ఓబన్న సేవలను గుర్తిస్తూ ఆయన జయంతిని అధికారిక రాష్ట్ర పండుగగా నిర్వ హిస్తున్నామని ఎమ్మెల్యే మాధవి తెలిపారు. కార్యక్రమంలో వుడా చైర్మన్ చిరుమామిళ్ల మధుబాబు, వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ ఎం ఈశ్వరరావు పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారంలో కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి

## 15, 16న 'ఆజాది బ్యాడ్మింటన్ టోర్నమెంట్-2026'

● బ్రోచర్స్ ఆవిష్కరించిన గళ్లా మాధవి

గుంటూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలుగుయువత నాయకుడు కొణిదె మోహన్ గోపీకృష్ణ ఆధ్వర్యంలో ఈనెల 15, 16 తేదీల్లో జరుగనున్న 'ఆజాది బ్యాడ్మింటన్ టోర్నమెంట్ -2026' బ్రోచర్‌ను పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి బుధవారం ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియంలో ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాలకు చెందిన బ్యాడ్మింటన్ క్రీడాకారులతో జరుగనున్న పోటీల్లో యువ క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు. టోర్నమెంట్ నిర్వాహకులు, తెలుగుయువత నాయకులు కొణిదే మోహన్ గోపీకృష్ణ మాట్లాడుతూ విజేతలకు భారీ నగదు బహుమతులు, ట్రోఫీలు, మెమెంటోలు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనాలనే క్రీడాకారులు తమ ఎంట్రీలను 9885622777ను సంప్రదించి నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ రాజపుత్ర సత్యం సింగ్, పరుచూరి సంజీవరావు, బ్యాడ్మింటన్ కోచ్ మనోజ్, వంశీ, రాజీవ్, దోవ లక్ష్మయ్య తదితరులున్నారు.

## గోపాల మిత్రను పునరుద్ధరించండి : కంచర్ల

గుంటూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో నిర్లక్ష్యం చేయబడ్డ గోపాలమిత్ర లాంటి కార్యక్రమాలను పునరుద్ధరించి పశుపోషకులను ఆదుకోవాలని జిల్లా పశుగణాభి వృద్ధి సంస్థ చైర్మన్ కంచర్ల శివరామయ్య సీఈవో సింహాచలాన్ని కోరారు. గుంటూరు కొత్తపేటలోని ఏపీ పశుగణాభివృద్ధి సంస్థ (ఏపీఎల్‌డీఏ) కార్యాలయానికి వెళ్లి బుధవారం ఆయన సీఈవో సింహాచలంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఉమ్మడి జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ సేవలందిస్తున్న 142 పశువైద్యశాలలకు, 114 గ్రామీణ పశువైద్య కేంద్రాలకు, 379 రైతు సేవాకేంద్రాలకు సమృద్ధిగా నిధులు అందించి ప్రోత్సహించాలని ఆయన కోరారు. రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ సీఈవో సింహాచలం మాట్లాడుతూ పశుపోషకులైన రైతులకు మేలు జాతి పశువులను అందించి పాల ఉత్పత్తి ని పెంచి పాడి రైతులను ఆదుకోవడమే ఆంధ్రప్రదేశ్ పశుగణాభివృద్ధి సంస్థ ధ్యేయమని అన్నారు. వాతావరణంలో ఎల్‌నినో లాంటి ప్రమాదకరమైన వాతావరణ పరిస్థితులు ఏర్ప డినప్పుడు పశువుల పోషణ రైతులకు లాభదాయకంగా ఉంటుందన్నారు.



సీఈవోకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కంచర్ల శివరామయ్య

## జావలిన్ త్రో విజేత కిషోర్



ప్రశంసా పత్రాలను అందజేస్తున్న కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్ తదితరులు

గుంటూరు(క్రీడలు), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): నేషనల్ జావలిన్ డే ను పురస్కరించుకొ ని స్థానిక బీఆర్ స్టేడియంలో బుధవారం జరిగిన పోటీల్లో అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లె టిక్స్ క్రీడాకారుడు జీజే కిషోర్ విజేతగా నిలిచాడు. వివిధ వయస్సు విభాగాల్లో జరిగిన ఈ పోటీల్లో అండర్-14లో వీ సెసిల్, సీహెచ్ జయ్, ఏ సంజయ్ పురుషుల విభాగంలో ఎం అజయ్‌కుమార్, వీ హెలి, విక్టర్‌పాల్‌లు వరుస స్థానాల్లో నిలిచారు. అనంతరం జరి గిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి జిల్లా అథ్లెటిక్స్ సంఘ కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్, అథ్లెటిక్స్ శిక్షకుడు వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథులుగా విచ్చేసి క్రీడాకారులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో శిక్షకులు శివారెడ్డి, రవి, దీప తదితరులు పాల్గొన్నారు.

बैंक ऑफ़ बड़ौदा Bank of Baroda బ్యాంక్ ఆఫ్ బరోడా

నగరంపాలెం బ్రాంచి, ప్లాట్ నెం.1బి, గ్రౌండ్ ఫ్లోర్, ఇండస్‌పామ్స్ అపార్ట్‌మెంట్, నగరంపాలెం, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522004, ఫోన్: 0863-2236196, 89775 13935, Mail: vjnpam@bankofbaroda.co.in

వాహనం యొక్క ఇ-వేలం లేదా అమ్మకం ప్రకటన

ఈ దిగువ చెప్పబడిన ఋణగ్రహీత బకాయి మొత్తము చెల్లింపులో విఫలమైనందున బ్యాంకు వారిచే ఋణగ్రహీతచే అమలు చేయబడిన తనఖా ఒప్పందము క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ ఈ దిగువ చెప్పిన తిరిగి స్వాధీనత/జప్తు చేసిన వాహనమును "ఎక్కడ ఎలా ఉన్నది అలాగే & అక్కడ ఏమి ఉన్నదో అదే" పద్ధతిపై వేలం వేయబడును.

| ఋణగ్రహీత పేరు/ చిరునామా | బకాయి మొత్తము | వాహనం యొక్క వివరములు | రిజర్వు ధర | ఇఎమ్‌డి | బ్రాంచ్ నందు సంప్రదించవలసిన వ్యక్తి | పార్కింగ్ ప్రదేశము |
|---|---|---|---|---|---|---|
| శ్రీ సురాద అమ్మోరయ్య, 7/5వ లైన్, శ్రీనగర్, సాయిబాబా రోడ్డు, గుంటూరు, ఆంధ్రప్రదేశ్, ఇండియా, పిన్: 522002. | ది.31.07.2026 నాటికి రూ.12,47,635.61 పై॥ (అక్షరాల పన్నెండు లక్షల నలభై ఏడు వేల ఆరు వందల ముప్పైఐదు రూపాయలు మరియు అరవై ఒక్క పైసలు మాత్రమే) మరియుది.04-08-2026 నుండి జమకూడు వడ్డీ ప్లస్ చెల్లించే నాటికి అయ్యే ఇతర ఖర్చులు. | SKODA AUTO & KUSHAQ AMBITION 1.0 TSI MT, WHITE COLOUR AP 40 CF 8218 CHASSIS NO. MEXK-PLPA8PG035821 ENGINE NO.DTB179355 | రూ. 9,50,000/- | రూ. 95,000/- | శ్రీ అత్తోట కెనాజ్, మొబైల్ నెం.89775 13953 | శ్రీ శ్రీనివాస ఏజెన్సీస్, డి.నెం.195, తక్కెళ్ళపాడు సర్వీస్ రోడ్, ఎన్‌హెచ్-16, ఆటోనగర్, ఇండియన్ ఆయిల్ బంక్ ప్రక్కన, అగతవరప్పాడు, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522509. |
| | | | కనీస బిడ్ పెంపుదల మొత్తం : రూ.20,000/- | | | |

అన్‌లైన్ పద్ధతి ద్వారా వాహన వేలం : https://baanknet.com/ తేది/ రోజు/ఇ-వేలం యొక్క సమయం : 08-09-2026, మంగళవారం, మ॥2.00 గం.ల నుండి 6.00 గం.ల వరకు, ధరావత్తు సమర్పించుటకు చివరి తేది : 08-09-2026, మంగళవారం, సాయంత్రం 6.00 గం.ల లోపు. ఉద్దేశించిన కొనుగోలుదారులు/బిడ్డర్లు వాహనాన్ని 02-09-2026 నుండి 07-09-2026 వరకు ఉదయం 11.00 గం.ల నుండి సా.4.00 గం.లలోపు తనిఖీ చేయవచ్చు. (శ్రీ శ్రీనివాస ఏజెన్సీస్, డి.నెం.195, తక్కెళ్ళపాడు సర్వీస్ రోడ్, ఎన్‌హెచ్-16, ఆటోనగర్, ఇండియన్ ఆయిల్ బంక్ ప్రక్కన, అగతవరప్పాడు, గుంటూరు) మరియు ఆన్‌లైన్ వేలం ప్రక్రియ కోసం దయచేసి బ్రాంచ్ హెడ్ శ్రీ అత్తోట కెనాజ్, మొబైల్ నెం.89775 13953 ను సంప్రదించగలరు.

ఇ-వేలం యొక్క నియమములు మరియు నిబంధనలు :

1) ఆసక్తి గల బిడ్డర్లు https://baanknet.com అనే ఇ-వేలం పోర్టల్ లో ఉచితంగా నమోదు చేసుకోవాలి. ఇ-వేలంలో పాల్గొనడానికి బిడ్డర్లు తమ ఆన్‌లైన్ బిడ్‌లను సమర్పించే ముందు, పోర్టల్ ద్వార అవసరమైన ధరావత్తు సొమ్మును జమ చేయాలి, 2) బ్యాంక్ ఆఫ్ బరోడా ఎటువంటి కారణం తెలుపకనే స్వీకరించిన ఆఫర్(లు) లేదా బిడ్(లు) లలో ఏదైనా లేదా అన్నింటిని తిరస్కరించే హక్కు ఉంటుంది. 3) బ్యాంక్ ఆఫ్ బరోడా సంబంధిత ఇ-వేలాన్ని ఎటువంటి కారణం తెలుపకుండా అంగీకరించే/ తిరస్కరించే/ వాయిదా వేసే/ రద్దు చేసే హక్కు ఉంటుంది. 4) అధీకృత అధికారికి తెలిసిన సమాచారం మేరకు, వాహనంపై ఎటువంటి రుణ భారం లేదు. ఏది ఏమైనప్పటికీ, ఆసక్తి గల బిడ్డర్లు తమకు తాముగా వాహనం తనిఖీ చేయడం మరియు సంతృప్తి చెందడం గురించి వారి స్వతంత్ర విచారణలు చేసుకోవచ్చు. (పూర్తి నియమ నిబంధనలకు https://baanknet.com ను చూడగలరు).

ప్రదేశం: నగరంపాలెం, గుంటూరు, తేది: 05-08-2026 సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి